# లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన



యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో బుధవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన చేశారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చక బృందం, వేద పండితులు వివిధ రకాల పూలతో కార్యక్రమం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణతంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవ చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.30,88,103 ఆదాయం సమకూరినట్లు ఈఓ గీత, అనువంశికధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు. స్వామివారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# అభివృద్ధికి మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరికలు



గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి
- చీకటిగూడేనికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక

కేతేపల్లి, అక్టోబర్ 25 : సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి మద్దతుగానే వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు జరుగుతున్నాయని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని చీకటిగూడేనికి చెందిన 50 మంది వివిధ పార్టీల నుంచి నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు నిరంతర ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రిదే అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టో గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. గడపగడపకూ తిరుగుతూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎగ్గడి సత్యనారాయణ, బుద్దె గణేశ్, కోట కాంతారావు, బుద్దె శ్రీనివాస్, బుర్రి రాఘవేందర్‌రావు, ఆల్దాసు సతీశ్ తదితరులు ఉన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు నల్లపు నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, ఎంపీటీసీ దాచేపల్లి నర్మదానాగేశ్వర్‌రావు, నాయకులు కోట పూర్ణచందర్‌రావు, కోట సంపత్, నర్సయ్య పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి



బీజేపీ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- బీజేపీ,కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 26 : సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గుజ్జ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 20 కుటుంబాలు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. మునుగోడులో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు గంగదేవి సత్తయ్య, నాయకులు పగిళ్ల శ్రీకాంత్, ఏర్పుల సైదులు, రాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసే పార్టీని ఆశీర్వదించండి

- నల్లగొండ జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి
- నక్కలపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక

నార్కట్‌పల్లి, అక్టోబర్ 25 : అభివృద్ధి చేసే పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతోనే బీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నారని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నక్కలపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసే అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద మాధవీనర్సింహ, చీనేటి సత్తయ్య, శ్రీపతి సైదులు, బాషపాక రవికుమార్, గద్దపాటి సైదులు, గుత్తా కరుణాకర్‌రెడ్డి, విష్ణుమూర్తి, డెంకల సత్తయ్య, భిక్షమయ్య, యాదయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

# బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- ఇంద్రియాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరిక

భూదాన్‌పోచంపల్లి, అక్టోబర్ 25 : భువనగిరి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇంద్రియాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పది మంది కార్యకర్తలు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నట్లు తెలిపారు. ముచ్చటగా మూడోసారి భువనగిరి ఎమ్మెల్యేగా తాను హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మొగిలిపాక నరేశ్, మొగిలిపాక సతీశ్, చంద్రశేఖర్, సీత మధు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల, పట్టణాధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శులు చిలువేరు బాలనర్సింహ, బందారపు లక్ష్మణ్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దిరెడ్డి యాదగిరి, నాయకులు రమేశ్, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రవణ్, యాదగిరి, కిరణ్ పాల్గొన్నారు.

# 6 కాదు.. 60 గ్యారెంటీలైనా ప్రజలు నమ్మరు



కాంగ్రెస్, బీజేవైఎం నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేవైఎం సీనియర్ నాయకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 25 : 6 కాదు.. 60 గ్యారెంటీలను ప్రకటించినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ప్రతి ఒక్కరూ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధికి మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో మోటకొండూర్, తుర్కపల్లి మండలం బిల్యానాయక్‌తండా, బొమ్మలరామారం మండలం తిమ్మాపురం, కాండ్లకుంట్లతండాకు చెందిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొలగాని లక్ష్మీనారాయణ, వంగపల్లి సురేశ్, బొట్ల నరేశ్, బీజేవైఎం నాయకుడు ఇస్లావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు తేజావత్ నరేశ్‌నాయక్, లౌడ్య సురేందర్, ప్రవీణ్‌నాయక్ తోపాటు 300 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఆలేరును అభివృద్ధి చేయాలన్న ఆలోచనే చేయలేదన్నారు. 65 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు సాగుజలాలు తీసుకురాలేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎఎస్ పాలనలో రూ.1,300 కోట్లతో యాదగిరిగుట్టను గొప్పగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. మిషన్ కాకతీయతో నియోజకవర్గంలోని సుమారు 600 చెరువులను ఆధునీకరించామన్నారు. పల్లెలన్నీ సుందరంగా మారాయని, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతోపాటు ప్రతి గ్రామాన్ని కలుపుతూ బీటీ రోడ్లు వేసినట్లు తెలిపారు. ప్రజలంతా అభివృద్ధిని చూసి ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో మోటకొండూర్ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదగిరి, ఎంపీటీసీలు పన్నాల అంజిరెడ్డి, ఉమ్లానాయక్, సర్పంచ్ హర్యానాయక్, ఉప సర్పంచ్ రమేశ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ భూమండ్ల బీరయ్య, బీఆర్‌ఎస్ గ్రామ శాఖల అధ్యక్షులు సుధీర్, కిషన్‌నాయక్, కోఆప్షన్ సభ్యుడు బురాన్, మాజీ డైరెక్టర్ జంగారెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరికలు

- దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, అక్టోంబర్ 25 : అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం గుడిపల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నుంచి భారీగా బీఆర్‌ఎస్‌లో చేరారు. మాదాపురానికి చెందిన 20 మంది, భీమనపల్లికి చెందిన 30 కుటుంబాలు, ఘనపురానికి చెందిన 30 కుటుంబాలు ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీలో మరిన్ని చేరికలు ఉండనున్నట్లు తెలిపారు.